## క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవు

: ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు



**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, ఒంగోలు టౌన్ డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు వన్‌టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది మొత్తం 11 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తమ తమ పరిధిలోని టీ షాపులు, బార్లు, హాస్టళ్లు మరియు ఇతర ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా క్రికెట్ మ్యాచ్‌ల సమయంలో గోప్యంగా నిర్వహించే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడింది. ఈ తనిఖీలలో భాగంగా గుంపులుగా ఉన్న ప్రదేశాల్లో వ్యక్తుల మొబైల్ ఫోన్లను పరిశీలించి, క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన వివిధ యాప్‌ల వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు గుర్తించినట్లయితే, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు. ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ లు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112/100 కు (లేదా) సంబంధిత పోలీస్‌అధికారులకు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీలో ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు టూ టౌన్ సిఐ శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయ్ కృష్ణ, 8 మంది ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడా పోటీలు

- మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నిర్వహణ



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, మేరా యువ భారత్, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు వాలీబాల్, కోకో, షార్ట్ పుట్, పరుగు పందెం నిర్వహించారు. వాలీ బాల్ లో 8 టీమ్ లు, కోకోలో నాలుగు టీమ్‌లు పోటీ పడ్డాయి. రన్నింగ్, షార్ట్ పుట్ లో దాదాపు 50 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా యూత్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి ప్రెసిడెంట్ భక్తుల కిరణ్ చంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విద్యతో పాటు క్రీడలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ క్రీడా పోటీలను క్విస్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్. వెంకట్ రావు, స్పోర్ట్స్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్ పర్యవేక్షించారు. క్రీడలను సమన్వయం చేసి, పోటీలు సజావుగా సాగేలా సహకరించిన కాలేజి యాజమాన్యానికి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోచ్ లకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## సబ్ కలెక్టర్‌ను కలిసిన దామచర్ల సత్య



**ఒంగోలు, ప్రభాతవార్త**

కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం నందు సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి వినతిపత్రం అందించారు.

## జనసేన పార్టీ ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**ఒంగోలు, ప్రభాతవార్త**

జనసేన పార్టీ ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమం దేశవ్యాప్తంగా గురువారం నుండి ప్రారంభించబడింది. దీనిలో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రకాశం జిల్లా పవన్ కళ్యాణ్ అభిమానులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అభిమానులు కూడా ఈ ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కోరుచున్నారు. నేడు శుక్రవారం 27వ తేదీన ఉదయం 11గంటలకు బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలులో లాయర్‌పేటలోని వారి నివాసంలో ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి విచ్చేసి జనసేన పార్టీ ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురించి జనసేన పార్టీ శ్రేణులకు వారి అభిమానులకు తెలియజేస్తారు. అందరూ కూడా బాలినేని శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి నేడు ఉదయం 11గంటలకు చేరుకోవాలని ప్రకాశం జిల్లా జనసేన పార్టీ జిల్లా కోఆర్డినేటర్ జడ బాలనాగేంద్రబాబు యాదవ్ తెలియజేశారు.

## రైజ్‌లో ఘనంగా ప్రారంభమైన ఫ్యూజన్ ఫెస్ట్ సంబరాలు



**ఒంగోలు, ప్రభాతవార్త**

స్థానిక వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ నందు ఈ నెల 26 నుండి 28 వరకు మూడు రోజుల పాటు రైజ్ ఫ్యూజన్ 2026 ఫెస్టిన ఘనంగా ప్రారంభించినట్లు కళాశాల సెక్రెటరీ కరెస్పాండెంట్ శిద్ధా హనుమంత రావు తెలియచేసారు. ఈ కార్యక్రమములో మొదటి రోజున తేదీన టెక్నికల్ ఫెస్ట్ కు రాష్ట్రములోని పలు కళాశాలల నుంచి సంబంధించిన విద్యార్థిని విద్యార్థులు ఆన్లైన్ మరియు స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా సుమారు గా 30 కళాశాలల నుండి 850 మంది పైగా విద్యార్థులు రిజిస్టర్ చేసుకొని పోటీలలో పాల్గొన్నారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ తేజ భాస్కరరావు తెలియచేసారు. ఈ టెక్నికల్ పోటీలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధించి 5 విభాగాలు, ఎంబీఏ విద్యార్థులకు సంబంధించి మూడు విభాగాలలో పోటీలను నిర్వహించి. వారిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రథమ, ద్వితీయ స్థానాలకు ఎంపిక చేసి వారికి నగదు, ప్రశంసా పత్రాలను అంద చేసినట్లు కళాశాల రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక తెలియచేసారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మేనేజ్మెంట్, ప్రిన్సిపాల్ వారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమములో కళాశాల సెక్రెటరి కరెస్పాండంట్ శిద్దా హనుమంత రావు, రాగ ఛైజీ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, డైరెక్టర్ డాక్టర్ భాస్కర రావు, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు పాల్గొన్నారు.

## వధువరులను ఆశీర్వదించిన శిద్ధా పద్మావతి



**ఒంగోలు, ప్రభాతవార్త**

దర్శి పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకుడు దేవత మహానంది మల్లీశ్వరి దంపతుల కుమారుడు భారత్ తేజ వెంకట లక్ష్మీసాత్విక నూతన వధూవరుల గృహంలో సత్యనారాయణ స్వామి వ్రతం పూజ కార్యక్రమంలో మాజీమంత్రి వర్యులు శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీపద్మావతి పాల్గొన్నారు. పూజ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మహానంది మల్లీశ్వరి దంపతులు లక్ష్మీపద్మావతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

## దోమలు కుడుతున్నా మొద్దు నిద్ర - నివారణను పట్టించుకోని యంత్రాంగం

**ఒంగోలు, ప్రభాతవార్త**

పట్టణాల్లో దోమల బెడద ఎక్కువైంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలతో నగర ప్రజలకు కంటినిండా నిద్ర కరువైంది. గండుచీమ పరిమాణంలోని దోమలు విజృంభిస్తున్నాయి. దోమకాటుతో పిల్లల నుంచి పెద్దల వరకు వివిధ జ్వరాల భారిన పడుతున్నారు. మురుగునీటి గుంటల్లో నీటి నిల్వలు ఎక్కువై దోమలు, కీటకాల బెడద ఎక్కువైంది. విషజ్వరాలకు కారణబూతమైన దోమలకు ఆవాసంగా నగరంలోని భారీ మురుగునీటి గుంటలు స్థానికులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ గుంతలను పూడ్చి ప్రజారోగ్యానికి చర్యలు చేపట్టాల్సిన పురపాలక, నగరపాలక, ప్రజారోగ్య విభాగాలు చోద్యం చూస్తున్నాయి. పట్టణాల్లో దోమల నివారణకు ఫాగింగ్ పక్రియ నామమాత్రంగా సాగుతుంది. వీధుల్లో నెలలు తరబడి ఫాగింగ్ చేయడం లేదంటూ ఆయా కాలనీ వాసులే బహిరంగంగా చెప్తున్నారు. దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉండే మురుగునీటి గుంటల్లో నూనె బంతులు విసరడం, డ్రైనేజీ కాలువల్లో మలాథియాన్ పిచికారి తదితర పనులు నగరంలో ఎక్కడా సక్రమంగా అమలు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజారోగ్య విభాగాల ద్వారా ఫాకింగ్ కోసం ప్రత్యేకంగా షెడ్యూల్ రూపొందించుకున్నా అవి కాగితాలకే పరిమితం. కొన్ని పురపాలక సంఘాల్లో ఫాగింగ్ చేయడానికి అవసరమైన యంత్రాలు సైతం కొన్ని మరమ్మత్తులకు గురైనట్లు సమాచారం. ఒంగోలులో మూడు యంత్రాలు ఉన్నా ఒకటి కూడా పని చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఏ వార్డులో చూసినా మురికి కాలువలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా నగర పాలక సంస్థ వారు పట్టించుకుని ఫాగింగ్ యంత్రాలను మరమ్మత్తులు చేయించి మురుగుకాలువల్లో పిచికారి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల



**ఒంగోలు, ప్రభాతవార్త**

గురువారం ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. బీపీసీఎల్ ఏదురు శివపురం రోడ్డులో దామచర్ల వెంకట సుబ్బయ్య కోల్డ్ స్టోరేజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని ఎస్‌జీవీఎస్ ఫంక్షన్ హాల్ నందు అన్ను వెంకట సుందరరావు కుమారుని వివాహ కార్యక్రమంలో కుటుంబం సమేతంగా పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని రవి ప్రియా మాల్ నందు ఈఎల్ఎస్ఈ మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పంపిణీకి ముందే పీడీఎస్ బియ్యం మాయం..?

- కనిగిరిలో రెచ్చిపోతున్న రేషన్ మాఫియా..
- ముడుపులు ఇస్తున్నాం.. మమ్మల్ని ఆపేదెవరు అంటున్న రేషన్ వ్యాపారులు
- ప్రజా ప్రతినిధుల పేరు చెప్పుకొని రెచ్చిపోతున్న మాఫియా
- చర్యలు చేపట్టలేని స్థితిలో అధికార యంత్రాంగం

**కనిగిరి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో అక్రమాలు పెరిగాయన్న ఆరోపణలు కనిగిరి నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పంపిణీకి ముందే మాయమవుతూ అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కనిగిరి పశ్చిమ ప్రాంతం రేషన్ బియ్యం దందాకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**పంపిణీకి ముందే దోపిడి :**

నియోజకవర్గంలోని 201 రేషన్ షాపుల్లో సుమారు 75వేల కార్డులు ఉన్నాయి. కనిగిరి, పామూరు మండల కేంద్రాల్లోని ఎఫ్‌సీఐ గోదాముల నుంచి ప్రతి నెల సుమారు 600 టన్నులు(కనిగిరి), 530 టన్నులు(పామూరు) బియ్యం సరఫరా అవుతోంది. అయితే అందులో గణనీయమైన భాగం రేషన్ మాఫియా చేతుల్లోకి వెళ్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ స్థాయి అధికారులను సైతం ప్రభావితం చేసే స్థాయిలో ఈ దందా సాగుతోందని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరు అధికారులు చర్యలు తీసుకోవాలనుకున్నా రాజకీయ సిఫార్సు, ఒత్తిళ్లు వ్యవస్థను నిశ్చేష్టులుగా మార్చేశాయన్న విమర్శలు ఉన్నాయి.

**గ్రామ గ్రామాన ఏజెంట్లు :**

ఒంగోలు కేంద్రంగా ఓ ముఠా గ్రామ స్థాయిలో ఏజెంట్లను నియమించుకున్నట్లు సమాచారం. ప్రతి షాపులో మిగిలే బస్తాలు, లారీల్లో లోడ్ అయ్యే పరిమాణం, ఇతర వ్యాపారులకు అమ్మకాల వివరాలు అన్నింటిని ఏజెంట్లు పర్యవేక్షిస్తున్నట్లు చెబుతున్నారు.



కేజీకి 30-50 పైసలు కమీషన్ ఇస్తున్నట్లు సమాచారం. పట్టణాల్లో 40 పైసలు వరకు చెల్లిస్తున్నట్లు తెలిసింది. గ్రామాల్లో అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు ఏజెంట్లుగా వ్యవహరిస్తుండగా, పట్టణంలో కొందరు డీలర్లు మొత్తం వ్యవహారాన్ని చక్కబెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**థంబ్ పాలసీ దుర్వినియోగం :**

ప్రతి నెల 26-31 తేదీల్లో వృద్ధులు, దివ్యాంగులు, బెడ్‌రెస్ట్ రోగులకు ఇంటి వద్దే రేషన్ సరఫరా చేయాలనే ప్రభుత్వ విధానాన్ని కూడాఅక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారని సమాచారం. ముందుగానే సాధారణ కార్డుదారుల బయోమెట్రిక్ వేలిముద్రలు తీసుకుని బియ్యం ఇవ్వకుండా కేజీకి రూ.10నగదు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో దాదాపు 1,500 ప్రత్యేక కార్డులు మాత్రమే ఉన్నప్పటికి, నెలాఖరులో 3 వేలకు పైగా కార్డులకు బియ్యం పంపిణీ చేసినట్లు వేలిముద్రలు నమోదుచేసి నివేదికలు సమర్పించడం అనుమానాలకు తావిస్తున్నట్లు తెలుస్తోంది.

**రూటు మార్చిన మాఫియా :**

నాలుగు నెలల క్రితం ప్రజా సంఘాల నేతలు పట్టణంలో 235 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అందులో 136 బస్తాలు పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం బియ్యమని బయటపడింది. ఈ ఘటన తర్వాత మాఫియా రూటు మార్చిందని సమాచారం. లారీల బదులు టాటా ఏసీ వాహనాల ద్వారా చిన్న చిన్న లోడ్‌లుగా తరలించి, ముందుగా డంపింగ్ పాయింట్లలో నిల్వ చేసి రాత్రికి రాత్రే బయటకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామ శివారు ప్రాంతాలు, జన సంచారం లేని ఇళ్లు, కొన్ని రేషన్ షాపులే డంపింగ్ కేంద్రాలుగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**రైస్ మిల్లులకే సింహభాగం :**

పొదిలి, కంభం, నెల్లూరు, గిద్దలూరు ప్రాంతాల రైస్ మిల్లులకు ఎక్కువగా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కార్డుదారుల నుంచి కేజీ రూ.10కి కొనుగోలు చేసిన బియ్యాన్ని డీలర్ మాఫియాకు రూ.16-17కు విక్రయిస్తాడు. ఖర్చులు కలుపుకుని రూ.25 వరకు చేరగా, చివరికి రైస్ మిల్లర్లు రూ.30-35 వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది.

**ముడుపులు ఇస్తున్నాం.. మమ్మల్ని ఆపేదెవ్వరు..? :**

ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ప్రతి నెల ముడుపులు చెల్లిస్తున్నామని, అలాంటప్పుడు తమ వ్యాపారాన్ని అడ్డుకునేది ఎవరో అంటూ రేషన్ మాఫియా వ్యాపారులు ధైర్యంగా మాట్లాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు చెడ్డపేరు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాఫియాకు అడ్డుకట్ట వేయాలంటే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**నిద్రలో నిఘా :**

ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ శాఖలు ప్రత్యేక నిఘా పెట్టాల్సి ఉన్నా, ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేయడాన్ని మినహాయించి గట్టి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పేదల రేషన్ బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి జారిపోతుండగా అధికార యంత్రాంగం వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజా పంపిణీ వ్యవస్థపై నమ్మకం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలు సకాలంలో పన్నులు కట్టి గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు

**జె.పంగులూరు ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**



గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషికి, లక్ష్యా సాధనకు చేయూతనందిస్తూ ప్రతి గ్రామంలో అభివృద్ధి చెందేలా గ్రామ ప్రజలు అందరూ సంబంధిత పన్నులు సకాలంలో కట్టి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండమూరు గ్రామపంచాయతీ పరిధిలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిని కె. స్వరూపారాణి ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఇంటి పనులు వసువులు, శానిటేషన్, ఎస్.డబ్ల్యూ. పి.సి.లపై ఎస్సీకాలనీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు ఇంటి పన్ను వసూలు 1.46 కోట్లు గాను 52 శాతం మాత్రమే వసూలు చేశారని, మిగిలిన 48 శాతం వసూలు చేయుటకు టీంలు ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ ద్వారా 5 రోజుల్లో వసూలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి పన్ను ఆన్‌లైన్ విధానం ద్వారా, ముఖ్యగా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ డబ్ల్యూ పిసి వద్ద జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిని కె. స్వరూపారాణి, మొక్కలను నాటారు. ప్రతినెల హరిత రాయబారులకు రెమ్యూనరేషన్ పెండింగ్ లేకుండా చెల్లించాలన్నారు. గ్రామంలో ఎక్కడా చెత్త దిబ్బలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, సైడ్ కాలువలను తరచుగా శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె. సుమంత్ పి.డి.ఓ , గ్రామ నాయకులు ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏ.ఎన్.ఎం.లు సచివాలయం సిబ్బంది, మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎం.ఆర్.పి.ఎస్ సీనియర్ నాయకుడు దాసరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన మందకృష్ణ మాదిగ

**జె. పంగులూరు ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**



మృతి చెందిన ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ఎంఆర్పిఎస్సి నాయకుడు దాసరి నాగేశ్వరావు అని ఉద్యమాల పితామహుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు దాసరి నాగేశ్వరరావు (70) మృతి చెందగా మంద కృష్ణ మాదిగ గురువారం చిత్రపటానికి పూలమాలవేసి, ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందటం పార్టీకి తీరని నష్టమని అన్నారు. కుటుంబ సభ్యులైన నాగేశ్వరరావు భార్య పుష్పాలు, ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు మస్తాన్ ఇతర కుటుంబ సభ్యులను అధైర్య పడవద్దని ఓదాచారు మందకృష్ణ మాదిగ. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, ప్రకాశం జిల్లా ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద మాదిగ, ఎంఎస్‌పి పట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దుద్దు వందనం మాదిగ, ఎమ్మార్పీఎస్ మార్కాపురం జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, ఎం ఈ ఎఫ్ ప్రకాశం, బాపట్ల జిల్లాల అధ్యక్షులు కత్తి ఐజక్, వంగే వరపు రమేష్ జిల్లా ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

## బీపీసీఎల్ అక్రమ కట్టడానికి తాళాలు

**ఉలవపాడు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**



కరేడు పంచాయతీలోని రామకృష్ణాపురం వద్ద బీపీసీఎల్ కంపెనీ నిర్మిస్తున్న కట్టడం వల్ల రామకృష్ణ పురానికి వెళ్లే మంచినీటి పైపులైను తరచూ పగలగొడుతున్నారు. పైపులైను పగలగొట్టడం వల్ల మాకు మంచినీటికి ఇబ్బందిగా ఉందని అడిగిన ప్రజలకు కాలువల్లో నీరు తాగమని కంపెనీకి చెందిన కొందరు వ్యక్తులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో రామకృష్ణాపురం ప్రజలు నిరసన కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ పరిమిషన్ లేకుండా భవనం నిర్మిస్తున్న కంపెనీ వారికి పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇచ్చినా ఎటువంటి సమాధానం చెప్పకుండా మాకు పైనుంచి పెద్దవాళ్ల పలుకుబడి ఉందని దాటవేస్తున్నారు. గురువారం ఎంపీడీవో సురేష్ అక్రమ నిర్మాణం చేపడుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు ఆ ప్రాంతంలో సెక్యూరిటీ తప్ప ఎవరూ లేకపోవడంతో గేటుకు తాళాలు వేయమని పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో పంచాయతీ సిబ్బంది గేటుకు తాళాలు వేసి నోటీసులు అంటించారు.

## అంగన్వాడీల డిమాండ్ల పరిష్కారానికై రిలే నిరాహార దీక్షలు



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికై పోరాటాన్ని కొనసాగించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రకాశంజిల్లా అధ్యక్షులు వై సత్యవతి అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. అంగన్వాడీల వేతనాల పెంచాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ వద్ద రిలే నిరహారధీక్షలను ఆమె రెండో రోజు ప్రారంభించారు. మద్దిపాడు కొండేపి ఉలవపాడు, కందుకూరు ప్రాజెక్టుల నుండి 20 మంది మంది రిలే నిరహారధీక్షలు చేసారు. వారికి సంఘీబావంగా వందమంది అంగన్వాడీలు పాల్గొన్నారు. ఈ రిలే నిరహారధీక్షలలో సిఐటియు జిల్లా కార్యదర్శి గెంటనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీలు వేతనాల పెంచాలని 42 రోజులు సమ్మెలో నాటి ప్రతిపక్షనేత, నేటి ముఖ్యమంత్రి ప్రభుత్వం వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని చేసిన వాగ్ధానాన్ని వమ్ముచేసారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు కావస్తున్నా 2 బడ్జెట్లు పెట్టినా నేటికి అంగన్వాడీల వేతనాల ఊసే ఎత్తకపోవడం మహిళలను నిలువునా మోసగించడమేనన్నారు. గుజరాత్ హైకోర్టు అంగన్వాడీ టీచర్ 24800, ఆయాకు 20300 వేతనాలు అమలు చేయాలని తీర్పునిచ్చినా రాష్ట్రంలో అతి తక్కువగా ఆయాలకు 7000 మాత్రమే ఇస్తున్నారన్నారు. వేతనాలు పెంచని ప్రభుత్వం పనిభారం మాత్రం పెంచిందన్నారు. రిటైర్మెంట్ బెన్ఫిట్స్, ఫెన్షన్ లేకుండా ఒట్టిచేతులతో అంగన్వాడీలను ఇంటికి సాగనంపుతున్నారన్నారు. మహిళల శ్రమకు తగిన ఫలితం ఇవ్వకుండా నమ్మించి మోసంచేయడమే మహిళల ఉద్దరణ అని ప్రశ్నించారు. సమ్మె ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలుచేయడంలేదన్నారు. గ్రాట్యుటి అసలు లక్ష్యాలకు ప్రభుత్వ జీఓ తూట్లుపొడిచిందన్నారు. రోజు రోజకి ప్రీస్కూల్స్ ను నిర్వీర్యంచేస్తుందన్నారు. అంగన్వాడీ వేతనాలు పెంచి బడ్జెటులో తగిన నిధులు కేటాయించాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి రాము మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ లో తగిన నిధులు కేటాయించకుండా ఐసిడియస్ ను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. యఫ్. ఆర్. యస్. యాఫ్ తో లబ్ధిదారులును తగ్గిస్తున్నారు. బడ్జెట్ లో నిధులు పెంచి ప్రీ స్కూల్ పిల్లలందరికి తల్లికి వంధనం అమలు చేయాలన్నారు. అంగన్వాడీలందరిని పర్మినెంట్ చేసేంతవరకు వేతనాలతో సంబందంలేకుండా ప్రభుత్వ సంక్షేమపథకాలను అందరికి అమలుచేయాలన్నారు. అంగన్వాడీలకు మే నెలంతా వేసవి సెలవు ఇవ్వాలని అన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు పి.యఫ్., ఇ. యస్. ఐ. ను అమలుచేయాలని అన్నారు. సిఐటియు జిల్లానాయకులు జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం జీతాలు పెంచకుంటే తగిన మూల్యం చెల్లించాల్సివస్తుందన్నారు. ఈ రిలే ఎం సుభాన్ పోలమ్మ ప్రసన్న మధురవాణి తదితరులు నాయకత్వం వహించారు.

## జనగణన నిర్వహణకు మండల అధికారులకు శిక్షణ

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రజల జీవన ప్రమాణాలను మార్చేందుకు ఉద్దేశించిన పథకాల రూపకల్పనకు జనాభా లెక్కలే కీలకం. పాలనా సౌలభ్యం. పేదరిక నిర్మూలనకు జనగణన దోహద పడనుంది. సాధారణంగా ప్రతి పదేళ్లకొకసారి జనాభా గణన జరగనుంది. చివరిసారిగా 2011లో నిర్వహించిన జనాభా లెక్కల అనంతరం 2021లో చేపట్టాల్సి ఉండగా, కరోనా తదితర కారణాలతో నిలిచిపోయింది. జిల్లాల విభజన అనంతరం తొలిసారిగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చేపట్టనున్న జన గణనకు ఏర్పాట్లు చురుగ్గా జరుగు తున్నాయి. తొలుత గృహాలు, ఆయా కుటుంబాల్లోని సభ్యుల నమోదుకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. మొదటి దశలో ప్రతి నివాసానికెళ్లి ఇల్లు ఏ తరహా నిర్మాణం, వంటగది, మరుగుదొడ్డి, ఏయే పరికరాలు ఉన్నాయి. తదితర వివరాలతో మొత్తం 32 ప్రశ్నలు నమోదు చేస్తారు. ఒక్కో ఎన్యుమరేటరు 200 గృహాలు కేటాయించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 15 నుంచి నెలాఖరు వరకు కేంద్రం ప్రకటించిన ప్రత్యేక యాప్లో కుటుంబ వివరాలన్నీ వ్యక్తిగతంగా ఎవరైనా నమోదు చేసుకునే అవకాశు కల్పించారు. మే 1వ తేదీ నుంచి నెలాఖరులోగా ఎన్యుమరేటర్లు వారి పరిదిలో ఇంటింటా తిరిగి పూర్తి వివరాలు సేకరించనున్నారు. అదే సమయంలో వ్యక్తిగతంగా యాప్లో నమోదు చేసుకున్న వారి వివరాలను కూడా మరోసారి పునఃపరిశీలించనున్నారు. అదే సమయంలో ప్రతి ఇంట్లోనూ ఎంత మంది కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారో నమోదు చేస్తారు. రెండో దశ కింద 2027, ఫిబ్రవరిలో 21 రోజులపాటు ఇంటింటికెళ్లి జనాభా గణన చేపట్టనున్నారు. తొలి. దశలో నమోదు చేసిన కుటుంబ సభ్యుల సంఖ్య స్థానంలో వారి పేర్లు నమోదు చేస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 నియోజక వర్గాలు ఉండగా, 2022లో జిల్లాల విభజనతో 8 నియోజకవర్గాలతో ప్రకాశం జిల్లా పరిమితమైంది. 2025, డిసెంబరు 31వ తేదీన మరోసారి జిల్లాల పునర్విభజనతో మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం నియోజకవర్గాలతో కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పాటైంది. అదే సమయంలో కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు ప్రకాశంలో విలీనమయ్యాయి. కొత్త జిల్లాల ప్రకారం గ్రామాలు, పట్టణాల్లో జనాభా లెక్కలు చేపట్టనున్నారు. ఈ సారి గణన ప్రక్రియ మొబైల్ యాప్, ఆన్లైన్ ద్వారా డిజిటల్ విదానంలో జరగనుంది. ఈ మేరకు ఇప్పటికే ఎన్యుమరేషన్ బ్లాకుల ఏర్పాటుతోపాటు సిబ్బంది నియామకం చేపట్టారు. జనగణన ప్రక్రియకు సంబంధించి స్థానిక కలెక్టరేట్లో ఈ నెల 27వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు మూడు రోజులపాటు ప్రకాశం జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కమిషనర్లు, ఏఎస్వోలకు శిక్షణ ఇవ్వనున్నారు. మార్చి 5, 6,7వ తేదీల్లో మార్కాపురం జిల్లాలోని మండల అధికారులకు మార్కాపురం కేంద్రంలో శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళిక చేశారు.

# భవితను మార్చే బలమైన ఆయుధం చదువు

## - తహసీల్దార్ రవి నాయక్



బల్లికురవ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
నేటి బాలల భవిష్యత్తును మార్చే బలమైన ఆయుధం చదువు అని తహసీల్దార్ రవి నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీ పరిధిలోని సుజాతనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కఠినంగా శ్రమపడే తత్వం, ఆత్మ విశ్వాసంతో ఎంతటి లక్ష్యాలైనా విద్యార్థులు సాధించగలుగుతారన్నారు. తాను బాల్య దశలో అక్షరం నేర్చుకునేందుకు ఎదుర్కొన్న కష్టాలను విద్యార్థులకు వివరించారు. నిరుపేద నేపథ్యం నుండి దేశ అత్యున్నత స్థానాలను అధిరోహించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవిత చరిత్రలను వారికి వివరించారు. పేదరికం అనేది ఒక తాత్కాలిక స్థితి మాత్రమేనని, ప్రతి ఒక్కరిలో ఉన్న ప్రతిభ, పట్టుదల మాత్రమే, శాశ్వతమైనవి అన్నారు. పేదరికం వల్ల ఏ ఒక్కరి చదువు ఆగిపోకూడదని, నేడు పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అందజేస్తున్న సకల సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ అత్యున్నత స్థాయిలో నిలిచేందుకు తమవంతు పోరాటం సాగించాలన్నారు. చదువుకునే సమయంలో కష్టాలు ఎదురైనా, ఎన్ని ఇబ్బందులు తారాసపడిన, నిరుత్సాహపడకుండా, తాము ఎదుర్కొన్న ప్రతి వైఫల్యాన్ని విజయానికి మొదటి సోపానంగా భావిస్తూ, కఠినమైన లక్ష్యాలను నిజం చేసుకునేందుకు, అకుంఠిత శ్రమతో,ఖచ్చితత్వంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థి దశలో కన్న ప్రతి కలను నిజం చేసుకునేందుకు విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవి నాయక్‌ను పాఠశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది.

# 8న మండల సర్వసభ్య సమావేశం



బల్లికురవ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
మండల సర్వసభ్య సమావేశం మార్చి8వ తేదీన నిర్వహించనున్నట్లుఎంపీడీవో కుసుమకుమారి తెలియజేశారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో నెలకొన్న సమస్యలను,వాటి పరిష్కార మార్గాలను ఈ సమావేశంలో ప్రముఖంగా చర్చించడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. ఎంపీపీ బదుగు శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని,సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,సహకార సంఘం అధ్యక్షులు హాజరు కావాలన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



వెలిగండ్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
మన శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కృషితో వెలిగండ్ల మండలం పరిధిలో మంజూరు అయిన రూ.7,50,000ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 13మంది లబ్దిదారులకు మండల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాల మేరకు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డిలు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు బొబ్బా రమణారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కారెంపూడి వెంకటేశ్వర్లు, మండల తెలుగు రైతు అధ్యక్షులు కీసరి రమణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సులోమాన్ రాజు, యూనిట్ ఇన్‌చార్జి వెన్నా రమణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సానా జయపాల్‌రెడ్డి, సోము చౌడారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు దేవిరెడ్డి రామిరెడ్డి, రావి గురుస్వామి, ముక్కు కోటిరెడ్డి, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు గుంటక నాగార్జునరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జేసీ శ్రీనివాసులు



పుల్లలచెరువు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
మండల కేంద్రమైన పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయాన్ని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు గురువారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా తనిఖీకి వచ్చినట్లు జేసీ తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అధికారులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న గేటాను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి స్వాగతం పలికిన తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి



పెద్దదోర్నాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెలుగొండ ప్రాజెక్టు పర్యటన సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి ఘన స్వాగతం పలికారు. సీఎం రాకతో ఈ ప్రాంతంలో ఉత్సాహ వాతావరణం నెలకొనగా యువత నాయకులు, పార్టీ నాయకులు, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో దోర్నాల మండలం టీడీపీ కన్వీనర్ షేక్ మాబు, టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది వల్లభనేని కాశయ్య, టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, టీడీపీ జిల్లా సహాధ్యక్షుడు ఇరుకసాని దేవయ్య, టీఎన్‌టీయుసీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఈదర మల్లయ్య, గంటవానిపల్లి సర్పంచ్ ఎక్కంటి రమాదేవి, కొప్పుల సుబ్బారెడ్డి, పెద్దదోర్నాల మండల జనసేన అధ్యక్షుడు కేతి వెంకట మోహన్ మురళి, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు తంగిరాల అశోక్‌రెడ్డి, రైతు నాయకులు సురవరంగండి వీరారెడ్డి, అమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.

# కటకానిపల్లి, రామచంద్రకోటలో పొలం పిలుస్తోంది



పెద్దదోర్నాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
పెద్దదోర్నాల మండలంలోని కటకానిపల్లి, రామచంద్రకోట గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ పాల్గొని మిరప, మినుము పంటలను సందర్శించడం జరిగింది. మండల వ్యవసాయాధికారి డి.జోహార్ లాల్ నాయక్ మాట్లాడుతూ రబీ కాలంలో సాగు చేసిన పంటలు అన్నింటిని గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా పంట నమోదు ఈనెల 26వ తేదీ లోపు ప్రతి ల్యాండ్ పార్శిల్‌ను తనిఖీ చేసి ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే రైతు యాప్ ద్వారా కూడా తన యొక్క ఫోన్ ద్వారా కూడా ఈ పంట నమోదు చేసుకోవచ్చని తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతు కూడా రైతు విశిష్ట నమోదు సంఖ్యను నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు విశిష్ట నమోదు సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ పథకం నగదు జమ అవుతుందని రైతులకు తెలియజేయడం జరిగింది. కావున ఏపీఎఫ్ఆర్ చేసుకొని రైతులు ఈ నెల 28వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. కంది పంట సాగు చేసిన రైతులు ప్రభుత్వ ధరకు అమ్ముకునేందుకు తప్పనిసరిగా సీఎం యాప్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ఆధారంగా ఈకేవైసీ పూర్తి చేసి నమోదు చేసుకోవాలని, అలా నమోదు చేసుకున్న రైతులకు రూ.8వేలు క్వింటా మద్దతు ధరగా ఎకరానికి 4 క్వింటాళ్ల వరకు కొనుగోలు కేంద్రానికి కందులు అమ్ముకోవచ్చని తెలిపారు. అలాగే భూమి ఉన్న ప్రతి రైతు కూడా తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ రైతు విశిష్ట నమోదు సంఖ్యను ఈ నెల 28వ తేదీ లోపు రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఎం.రాజేంద్ర ప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పేకాట ప్రాంతంపై దాడి



సంతనూతలపాడు(మద్దిపాడు), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
మద్దిపాడు మండల పరిధిలోని గ్రోత్ సెంటర్ పరిసరాల్లో పేకాట ఆడుతున్న ప్రాంతంపై గురువారం నాడు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద గల రూ.15,600లను ఈ మేరకు స్వాధీన పరుచుకుని సీజ్ చేసినట్లు మద్దిపాడు ఎస్సై జి.వెంకట సూర్య తెలిపారు.

# వెలుగొండ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాను.. కారణాలు చెప్పొద్దు

## - పనులు వేగవంతంగా చేయండి - జూన్ 15నాటికి ప్రారంభోత్సవం చేస్తా

## - వెలుగొండ ప్రాజెక్టుపై నిర్మాణ సంస్థ ప్రతినిధికి సీఎం చంద్రబాబునాయుడు కఠిన హెచ్చరిక



పెద్దదోర్నాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
వెలుగొండ ప్రాజెక్టును వ్యక్తిగతంగాను,ప్రతిష్ఠాత్మకంగానూ తీసుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. పనులు వేగవంతంగా చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆయన కఠినంగా హెచ్చరించారు. కారణాలు చెప్పకుండా పనుల పురోగతిపై దృష్టి పెట్టాలని సీఎం హెచ్చరించారు.జూన్ 15న వచ్చి ప్రారంభోత్సవం చేస్తానని, అందుకు అనుగుణంగా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఆలస్యం ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. వెనుకబడిన రైతాంగానికి ఎంతో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందుతాదని, రైతుల ఆశలు ఈ ప్రాజెక్టు పైన ఉన్నాయని, అందుకే అధికారులు కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేసి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ ఆధునీకరణ పనుల శంకుస్థాపనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెలుగొండ ప్రాజెక్టు నమూనాను పరిశీలించిన అనంతరం కాంట్రాక్టు సంస్థ ప్రతినిధితో మాట్లాడారు.

# మాదిగలకు ఆరామ క్షేత్రంకు స్థలం కేటాయించి నూతన భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే జనార్ధన్‌కు వినతి

## - ఆరామ క్షేత్ర భవన నిర్మాణంకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే జనార్ధన్



నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
ఒంగోలు నగరంలో మాదిగలకు ఆరామ క్షేత్ర భవన నిర్మాణంకు స్థలం కేటాయించి నూతన భవనాన్ని నిర్మించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముసుజన్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుని కలిసి వినతిపత్రాన్ని అందించారు. సొంత ఇల్లు లేని వారు అద్దె ఇళ్లల్లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగాలు, రోజువారి పనులు చేసుకొని జీవనం సాగించేవారు మృతి చెందిన సమయాలలో వారిని అద్దె ఇంటి యజమానులు వారి మృతదేహాన్ని కూడా ఇంటికి రాకుండా అడ్డుకుంటున్నారని దీనిని మానవతా సమస్యగా గుర్తించాలన్నారు. కనీసం పది రోజులకు పైగా వారు ఎక్కడ ఉండాలో అర్థం కాని పరిస్థితి నెలకొంటుందన్నారు. దీనిని ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకొని ఒంగోలు నగరంలో మాదిగలకు ఆరామ క్షేత్ర భవన నిర్మాణంకు స్థలం కేటాయించి నూతన భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే జనార్ధన్‌రావుని సుజన్ మాదిగ కొరటం జరిగింది. ఈ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే జనార్ధన్‌రావు మాట్లాడుతూ తప్పకుండా మాదిగలకు ఆరామ క్షేత్ర నిర్మాణంకు స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణంకు చర్యలు చేపడామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీఎస్ ప్రతినిధులు గద్దె త్యాగరాజు, కలల దండోరా పత్రిక ఎడిటర్ అంగలకుర్తి, ప్రసాద్, తేళ్ల జయరాజ్, పాటిబండ్ల రాజశేఖర్, బక్కా ఆనంద్, పొగడ్త నారాయణ, మందా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మనుషులమని గుర్తించి మానవత్వంతో మెలగాలి

## - మార్చి 14వ తేదీ జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

## - జిల్లా లోక్‌అదాలత్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్



నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గురువారం నిర్వహించబడిన లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నందు ముఖ్య అతిధిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లోక్ అదాలత్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరూ న్యాయ స్పృహ కలిగి ఉండాలని చట్టాల పట్ల గౌరవం, అవగాహన కలిగి ప్రవర్తించాలని, చిన్న చిన్న విషయల్లో న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని, ధనాన్ని వృధా చేసుకోకూడదని పేర్కొన్నారు. సాంఘిక రుగ్మతలైన లింగ, కుల వివక్షత, బాల కార్మికులు బాల్య వివాహాలు, వెట్టిచాకిరి లేని సమాజ స్థాపనకు కృషి చేయాలని సూచించారు. యుక్త వయసు పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి బోధించాలని తెలిపారు. వృద్ధులైన తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్స్‌కు ఆదరణ, భద్రత కల్పించాలని సూచించారు. ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు, వైవాహిక సంబంధ సమస్యలు, ఆర్థిక రుణసంబంధ సమస్యలు వంటి సివిల్ లిటికేషన్స్‌ను మార్చి 14వ తేదీ నెలలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి లోక్ అదాలత్ నందు పరిష్కరించుకోవాలని ప్రకటించారు. వ్యవసాయ సంబంధ పనులలో రైతులు, కూలీలు సామరస్యంగా సమన్వయంగా వ్యవహారించాలని ఏ ఒక్కరూ మరొకరును ఇబ్బంది పెట్టే పని చేయకూడదని, ముఖ్యంగా పొగాకు పనుల నిమిత్తం దూర ప్రాంతాలు నుండి వచ్చిన కూలీల విషయంలో రైతులు ఆదరణ కలిగి భద్రత కల్పించాలని రైతు కూలి బేధం కంటే అందరం మనుషులు అని గుర్తించే మానవత్వంతో మసులుకోవాలని తెలిపారు. వర్క్ షాపు అనంతరం పోతవరం గ్రామంలో పొగాకు రైతులు కూలీలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి తేళ్ల రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ కే.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.ఆశాజ్యోతి, కార్యాలయ పాలనాధికారి యుఎండీ మూర్తి, పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సంఘ సహాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



కందుకూరు ఫిబ్రవరి 26,ప్రభాతవార్త
బోధనాసామాగ్రిని ఉపయోగించి విద్యార్థులకు సులభరీతిలో పాఠ్యాంశాలు బోధించాలని మండల విద్యాశాఖాదికారి నాగకుమారశర్మ తెలిపారు. కందుకూరు మండలంలోని ఇస్కాలవారివీదిలోని మోడల్ ప్రైమరీ స్కూల్ పనితీరును గురువారం ఆయన పరిశీలించారు.ఇందులో బాగంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును బోధనాతీరు,పాఠశాలలో నిర్వహిస్తున్న 75 రోజుల అక్షరాస్యత కార్యక్రమ అమలు మధ్యాహ్నం భోజనం నిర్వహణ తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు.విద్యాభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయులు దివి కోటేశ్వరరావును, ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో టీచర్సు సిబ్బంది ఏవిరావు,కొండప నాయుడు, పిఎల్ లక్ష్మినరసింహం,పివి రమేష్, వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు అరీఫ్, నాగకుమారి, మెర్సీ ఫ్లోరెన్స్ బ్రహ్మయ్య,సిఆర్ఎంటి, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

# స్కందపురి మెకానికల్ యూనియన్ ఏర్పాటు

## - ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

## - కార్మికశాఖాధికారిణి సుజాత



కందుకూరు ఫిబ్రవరి 26,ప్రభాతవార్త
ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు కార్మికశాఖాధికారిణి పి.సుజాత కార్మికులుకు సూచించారు. గురువారం స్కందపురి ఆగ్రో మెకానికల్ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా ఈశ్రం, పిఎంఎస్‌వై లో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈశ్రం ప్రమాద బీమా రూ.1లక్ష నుంచి రూ.3లక్షలు ఉందన్నారు. అదేవిధంగా పిఎంఎస్‌వై పథకంలో 60 ఏళ్ల వరకు ప్రభుత్వం వారు సూచించిన మొత్తాన్ని చెల్లిస్తే ప్రతినెల రూ.3 వేలు పెన్షన్ వస్తుందన్నారు.అనంతరం సుజాతను యూనియన్ నేతలు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్కందపురి ఆగ్రో మెకానికల్ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ పీలా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నూకల వెంకట సుబ్బారావు, కోశాధికారి గొర్రెపాటి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ షేక్ హాజీ భాష,షేక్ అరీఫ్ జాయింట్ సెక్రెటరీ మద్దసాని కొండయ్య కో ట్రెజరర్ పర్వేజ్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి కొలుపులు కార్యక్రమంలో పాల్గొన్న Dr. గొట్టిపాటి లక్ష్మీ లలిత్ సాగర్ దంపతులు



దొనకొండ,ఫిబ్రవరి 26,ప్రభాతవార్త
దొనకొండ మండలం, దొండపాడు గ్రామంలో గురువారం అమ్మవారి కొలుపులు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి అస్సిసులు తీసుకున్న దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ లలిత్ సాగర్ దంపతులు. వారితో పాటు దొనకొండ మండల టిడిపి అధ్యక్షులు మోడీ ఆంజనేయులు,మాజీ మండలపార్టీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావు, రమణయాదవ్ ,పత్తి వెంకటేశ్వర్లు,క్లస్టర్లు, యూనిట్ బూత్ ఇంచార్జ్‌లు దొండపాడు గ్రామం టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి



పొన్నలూరు ,ఫిబ్రవరి 26,ప్రభాతవార్త
మండలంలోని చెన్నుపాడు వద్ద పాలేరు నదిపై సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సిపిఎం బృందం ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూస్థానిక మంత్రివర్యులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చొరవతో ప్రభుత్వం ఇటీవల సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్లో 25 కోట్లు కేటాయించడం సంతోషకరమని, కేటాయింపులతో పాటు పనులను వెంటనే చేపట్టి ఈ ప్రభుత్వ కాలంలోనే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. 201415 ప్రాంతంలో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని, అందుకు సుమారు 50 కోట్లు అవసరం అవుతాయని, అవసరం మేరకు నిధులు కేటాయించి తమ ప్రభుత్వం నిర్మిస్తుందని ప్రజలకు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.ఆ తర్వాత కాలంలో ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపనందున నిర్మాణ పనులు నిలిచిపోయాయని అన్నారు. కొండేపి నియోజకవర్గంలోని ప్రజలు దాదాపుగా వర్షాధారం మీద ఆధారపడి జీవిస్తున్నారని ప్రాజెక్టు నిర్మాణానికి పాలకులు తగిన శ్రద్ధ చూపనందున తాగునీరు, సాగునీటి సమస్య నియోజకవర్గంలో నేటికీ కొనసాగుతున్నదన్నారు. పదేళ్ల క్రితం 50 కోట్లతో నిర్మాణం పూర్తి చేద్దామనుకున్న ప్రాజెక్టు ఈరోజు 165 కోట్ల అంచనాకు చేరిందని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ సంగమేశ్వరం ప్రాజెక్టు కొండేపి నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అని,ప్రాజెక్టు నిర్మాణంతో పొన్నలూరు,కొండేపి మండలాల్లోని పదివేల ఎకరాలకు సాగునీరు,60 గ్రామాల ప్రజలకు త్రాగునీటి అవసరాలు తీరతాయని, దానితోపాటు భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి వనరుల లభ్యత మెరుగుపడుతుందన్నారు. నిత్యం కరువు, వలసలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ ప్రాజెక్టు నిర్మాణం పెద్ద ఆసరాగా మిగులుతుందని, తక్షణమే ప్రభుత్వం నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అంగలకుర్తి చిన్న బ్రహ్మయ్య, మల్లెల చిన్నపేతురు, గడ్డం వందనం, లక్కపోగు సుధాకర్, సి హెచ్ అంకయ్య,ఎల్. సాల్మన్, ఏ. ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్‌రెడ్డి మృతి టీడీపీకి తీరని లోటు



తాళ్లూరు,ఫిబ్రవరి 26,ప్రభాతవార్త
టీడీపీ సీనియర్ నాయకుడు ఐడమకంటి శ్రీనివాస్‌రెడ్డి మృతి టీడీపీకి తీరనిలోటని దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి,కడియాల లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టిపాపారావు అన్నారు. తాళ్లూరులో గురువారం జరిగిన శ్రీనివాస్‌రెడ్డి పెద్ద కర్మ కార్యక్రమం లో పాల్గొన్నారు. శ్రీనివాస్‌రెడ్డి పార్టీ బలోపేతానికి చేసిన కృషి మరువలేనిదన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.అనంతరం ఆయన తండ్రి వెంకటరెడ్డి,భార్య,కుమారుడు,కుమార్తెను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతి తెలియపర్చారు.నివాళులర్పించిన వారిలో అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, ఐడమకంటి రమణారెడ్డి,ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు,మండల టీడీపీఅధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బి.ఓబుల్ రెడ్డి,ఐ.వెంకటేశ్వరరెడ్డి,మానం రమేష్ బాబు, జి.రమణా రెడ్డి (సమర),వి.సుబ్బయ్య,గొల్ల పూడి వేణు బాబు, కైపు రామకోటిరెడ్డి,రాచకొండ వెంకట్రావు,వెలుగు సుబ్బారావు, కైపు నాగార్జున రెడ్డి, పుట్టా నరసింహారావు, బొద్దు హనుమారెడ్డి, గంగిరెడ్డి కృష్ణారెడ్డి, శివ నాగిరెడ్డి,యాతం చవిట్‌రెడ్డి, ఎన్.సాగర్, యత్తపు కాశిరెడ్డి,వి.సుధాకర్‌రెడ్డి, రావి నూతల పరిశుద్ధరావు,చాట్ల డానీ,ఎన్.కళ్యాణ్, కోనేటి వెంకట్రావులు ఉన్నారు.

## నిందతులుకు పోలీసుల కౌన్సిలింగ్



కందుకూరు ఫిబ్రవరి 26,ప్రభాతవార్త
గుడ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిద కేసుల్లో పలువురు నిందితులుకు గురువారం పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. పేకాట కేసు ముద్దాయిలు మరియు పేకాట అనుమానితులును గుడ్లూరు పోలీస్ స్టేషన్ పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. బైండోవర్ కేసు నమోదు చేసి మరియు అశుభ్రంగా ఉన్న ప్రాంతాలను వారితో శుభ్రం చేయించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకి పాల్పడిన యెడల వారి మీద కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.

## పలుకూరులో స్వచ్ఛరథం ప్రారంభం




కందుకూరు ఫిబ్రవరి 26,ప్రభాతవార్త
స్వచ్ఛరథం ప్రారంభోత్సవ కార్యక్రమము క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగబ్రహ్మం, కందుకూరు మండలంలోని పలుకూరులో గురువారం స్థానిక ఎంపీడీవో రత్నజ్యోతి ఆధ్వర్యంలో పొడి చెత్త సేకరణ నిమిత్తం స్వచ్ఛ రథము కార్యక్రమంను ప్రారంభోత్సవం చేశారు.ఈ పొడిచెత్తను సంబందిత సిబ్బందికి చేర్చి ప్రత్యామ్నయంగా అవసరమైన వస్తువలును పొందాలని నిర్వహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి కొండలరావు, గ్రామ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ కమిటీల ప్రక్రియ పూర్తి చేయాలి

## - వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా



కందుకూరు ఫిబ్రవరి 26,ప్రభాతవార్త
కందుకూరు నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న గ్రామకమిటీల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ వైసీపీ శ్రేణులకు సూచించారు.గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశమైనారు.ఈ కార్యక్రమంలో కందుకూరు రూరల్,లింగసముద్రం, వలేటివారిపాలెం,గుడ్లూరు,ఉలవపాడు ముఖ్య నాయకులుతో చర్చించారు. అలాగే కష్టపడ్డ ప్రతి నాయుకునికి, కార్యకర్తలకు రాబోయే రోజుల్లో మేలుజరుగుతున్నారు.పార్టీకోసం పనిచేసిన వారిని గుర్తించి కమిటీలల్లో సముచిత స్థానం కల్పించాలని నిర్వహకులుకు ఆయన సూచించారు.

## ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రుద్రవరంలో మెరుగైన అభివృద్ధి

### - రుద్రవరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కూకట్ల శరత్‌బాబు వెల్లడి



సంతనూతలపాడు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామంలో శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ముమ్మర అభివృద్ధి జరుగుతున్నట్లు రుద్రవరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కూకట్ల శరత్‌బాబు పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం కింద మంజూరైన గ్రామ ఆరోగ్య కేంద్రానికి గురువారం నాడు మాజీ సర్పంచ్ కూకట్ల విజయమ్మ, రుద్రవరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కూకట్ల శరత్‌బాబులు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శరత్‌బాబు గ్రామ అభ్యున్నతిపై ప్రజలకు వివరించారు. మూడు నెలల్లో ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నట్లు శరత్‌బాబు వెల్లడించారు. రుద్రవరం గ్రామంలో పలు రంగాల అభివృద్ధికి ఎమ్మెల్యే విజయ్ కుమార్ సేవలు మరువరానివని శరత్‌బాబు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీపీ కూకట్ల కోటయ్య ముఖ్యంగా టీడీపీ పాలనలో రుద్రవరం గ్రామంలో తాగునీటి నిమిత్తం వాటర్ ట్యాంకును, పలు కాలనీలలో సీసీ రోడ్డు, ఎస్సీ కాలనీలో స్మశానం, నిర్మాణం, ఎస్సీ కాలనీ ముంపుకు గురు కాకుండా భారీ సైడు కాలువలను తదితర ఎన్నో అభివృద్ధి పనులను 95శాతం మేరకు ముఖ్యంగా టీడీపీ పాలనలో రుద్రవరం గ్రామంలో చేపట్టినట్టు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కూకట్ల శరత్‌బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వీరాంజనేయులు, రుద్రవరం గ్రామ టీడీపీ అధ్యక్షులు బి.మల్లిఖార్జునరావు, నీటి సంఘం అధ్యక్షులు కే.చలపతిరావు, ఉపాధ్యక్షులు యు.వెంకటేశ్వరరావు, పంచాయతీ అభివృద్ధి అధికారిణి మమత, టీడీపీ మహిళ నాయకురాలు అనిత, టీడీపీ నేత బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యేలు అన్నా , ఉడుముల



కొనకనమిట్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
మండలంలోని గొట్లుగట్టు మాజీ ఎంపీటీసీ గోనుగుంట్ల శ్రీనివాసులు కుమార్తె తన్మయి వివాహ కార్యక్రమానికి మార్కాపురం నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. వధూవరులు తన్మయి మణిదీప్‌లను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జడ్పీటీసీ అక్కి దాసరి ఏడుకొండలు,మండల వైకాపా కన్వీనర్ మోరాశంకర్‌రెడ్డి,మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, వైస్ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, నాయకులు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మందలపు శ్రీనివాస్‌రెడ్డి, పోలసాని నారాయణరెడ్డి, గాడి కోనేటి రెడ్డి,విద్యార్థి విభాగం నాయకులు సంజీవరెడ్డి, వైకాపా జిల్లా కార్యదర్శి నాగం ప్రసాద్, ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

### శ్రీశైలం గాయత్రి పీఠాధిపతి పట్టాభిషేకం కార్యక్రమం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణ






**చీరాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
శ్రీశైలంలో ఉమా రామలింగేశ్వర దేవాంగ నిత్య అన్నదాన సత్రంలో పడవీడు గాయత్రీ పీఠం పీఠాధిపతులు చెన్న కోటిలింగమూర్తి స్వామి ఆశీస్సులతో శ్రీశైలం గాయత్రి ద్వితీయ పీఠానికి పీఠాధిపతిగా శ్రీ చల్లా రామారావుకి పట్టాభిషేకం చేసి కిరీటం, నంది ధ్వజం ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా సత్రం ప్రాంగణంలో గణపతి పూజ, పుణ్యహ వచనం, పంచగవ్య ప్రసాన, శివుడు పార్వతీ చౌడేశ్వరి దేవి సహస్ర నామ అర్చన, గాయత్రి పవనం, ఆదిత్యది నవగ్రహ మండపం అర్చన పూజాది కార్యక్రమాలు జరిగాయి. తదుపరి మంగళ స్నానం నామకరణ జరిగింది. పడవీడు గాయత్రీ పీఠం పీఠాధిపతులు శ్రీ చెన్న కోటిలింగమూర్తి స్వామివారిచే రామారావుకి కిరీటిధరణ, నంది ధ్వజంచే పట్టాభిషేకం చేసి వారికి ఓం శ్రీ దేవాల పరబ్రహ్మా స్వామి అని నామకరణం చేశారు. శ్రీశైలం బ్రహ్మరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయం ప్రధాన అర్చకులు శ్రీమఠం శివశంకరయ్య, శ్రీరామారావుకి వేద మంత్రాలతో ఆశీస్సులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి అనేక మంది దేవాంగ ప్రతినిధులు, కుల సేనాధిపతులు, ప్రజలు, చెన్నైకి చెందిన వారు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల వారితో సమావేశం



**చీరాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
చీరాల తహసీల్దార్ కార్యాలయం నందు ఆర్డీవో ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల తోటి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గం లో ఓటర్ల నమోదు సవరణ, తొలగింపు కార్యక్రమాలు పారదర్శకతో బీఎల్‌వోలు చేస్తున్నారని ఏమైనా లోటు పాట్లు ఉంటే మా దృష్టికి తేవాలని అన్నారు. అలాగే ఇప్పటి వరకు చేర్చిన ఓటర్లు, సవరించిన తొలగించిన ఓటర్ల వివరాలు తెలియజేశారు. ముఖ్యంగా అన్ని రాజకీయ పార్టీల వారు తమ బూతు ఏజెంట్ల వివరాలు విధిగా ఇవ్వాలని మార్చి 2వ వారం లోపల మీ బూత్ ఏజెంట్ లిస్టు ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, చీరాల ఎమ్మార్వో గోపికృష్ణ, వేటపాలెం ఎమ్మార్వో గీతారాణి, చీరాల ఎంపీడీవో విజయశ్రీ, వేటపాలెం ఎంపీడీవో రాజేష్, చీరాల మున్సిపల్ కమీషనర్ డేనియర్ జోసెఫ్, జనసేన పార్టీ నుండి గూడూరు శివరాం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నుండి కీర్తి ప్రసాద్, బీఎస్పీ నుండి భగత్ సింగ్, సీపీఎం నుండి ఎన్.బాబురావు, వైసీపీ నుంబి బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకర్, కాంగ్రెస్ నుండి అలీమ్, ఎంపీడీవో ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కార్యకర్త విధులకు డుమ్మా .. కేంద్రం వెలవెల

**- పట్టించుకోని అధికారులు**



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
మండలంలోని గార్లదిన్నె అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త తరుచుగా విధులకు గైర్హాజరవుతుండడంతో చిన్నారులు, గర్భిణీలు,బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. రోజువారీగా ఇవ్వాల్సిన పౌష్టికాహార పదార్థాలు కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. గురువారం కేంద్రంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అంగన్‌వాడీ కార్యకర్త రాకపోవడంతో పిల్లలు కూడా ఇళ్ల దగ్గరే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. తనిఖీలు చేయాల్సిన ఐసీడీఎస్ అధికారులు కూడా ఈ కేంద్రం వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా విధులకు హాజరుకాని అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### మార్కాపురం పర్యటనకు బుధవారం విచ్చేసిన సీఎం చంద్రబాబును కలిసిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
మార్కాపురం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రాష్ట్ర తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీఎంను కలిసినట్టు తెలిపారు. మార్కాపురం జిల్లా అభివృద్ధి కోసం అధిక నిధులు తెచ్చేందుకుకృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### సీఎం చంద్రబాబునాయుడును కలిసిన చిన్నారికట్ల సొసైటీ అధ్యక్షులు సానికొమ్ము



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
మార్కాపురం పర్యటనకు బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును చిన్నారికట్ల సింగిల్ విండో అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ కోసం కష్టపడి పని చేయాలని,భవిష్యత్తులో పార్టీ కోసంమరింత కష్టపడాలని సానికొమ్ము వెంకటేశ్వర రెడ్డికిముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు.

## సాయిబాబాపై అసత్య ప్రచారం ఆపాలి

**- యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సాయిభక్తుల వినతి**



**మార్కాపురం, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లాలో కొందరు యూట్యూబ్ ఛానెల్స్ షిర్డి సాయిబాబా వారిపై అసత్యాలు ప్రచారం చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మార్కాపురం జిల్లా షిర్డి సాయి భక్త సమాఖ్య జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతి పత్రం సమర్పించింది. సమాఖ్య ప్రతినిధులు పేర్కొంటూ, గత కొంతకాలంగా కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ సాయిబాబా వారిపై అవాస్తవాలు, దూషణలు చేస్తూ భక్తులు–భక్తులు కానివారు అనేలా సమాజాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధమైన రెచ్చగొట్టే మాటలు భవిష్యత్తులో మత ఉద్రిక్తతలు, ఘర్షణలకు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సాయిబాబా వారు ప్రేమ, శాంతి, ఐకమత్యం, మతసామరస్యం, జాతీయ సమగ్రత వంటి విలువలను బోధించారని, కానీ సంబంధంలేని విషయాలను ఆపాదిస్తూ సాయిబాబా వారిపైనా, వారి భక్తులపైనా విద్వేషాన్ని పెంచేలా ఈ ఛానెల్స్ వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఇది భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించే చర్యగా వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం యూట్యూబ్ వీడియోలను పరిశీలించి, విద్వేషాన్ని రెచ్చగొట్టే ఛానెల్స్‌పై నిషేధం సహా తగిన కఠిన చర్యలు తీసుకోవాలని సమాఖ్య కోరింది. పరిస్థితులు మరింత విషమించకుండా తక్షణ జోక్యం అవసరమని వినతిలో స్పష్టం చేశారు.

### గిద్దలూరు రైల్వే ఉద్యోగిని షేక్ షకీలాకు మహిళా కీర్తి రత్న అవార్డు



**గిద్దలూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**
ఉమ్మడి ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన రైల్వే ఉద్యోగిని షేక్ షకీలా ప్రతిభకు అరుదైన గుర్తింపు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమెకు˘మహిళా కీర్తి రత్న – ఉమెన్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. ఈ కార్యక్రమం మార్చి 3వ తేదీ మంగళవారం విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయం (బెంజ్ సర్కిల్)లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. షకీలా రచించిన కవితలు, సాహిత్య రచనలు, అలాగే ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలను సమగ్రంగా పరిశీలించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డును సంస్థ గౌరవ అధ్యక్షుల చేతుల మీదుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిద్దలూరు ప్రాంతానికి చెందిన సాహితీవేత్తలు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు షేక్ షకీలా కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా షేక్ షకీలా మాట్లాడుతూ తన కవితలను ఆదరించి, సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ గౌరవానికి ఎంపిక చేసిన శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ డా కత్తిమండ ప్రతాప్‌కు, సంస్థ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనకు మరింత సాహిత్య సేవ చేయడానికి ప్రేరణగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

### నూతన దంపతులకు బోయళ్ల నారాయణరెడ్డి ఆశీర్వచనం



**సీఎస్‌పురం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన సీఎస్‌పురం శ్రీకామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం అర్చకులు శ్రీ కృష్ణ శర్మ కుమార్తె వివాహం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గుళ్ళాపల్లి గ్రోత్ సెంటర్‌లోని శ్రీ కన్వెన్షన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వివాహ కార్యక్రమానికి హాజరైన టీడీపీన ఆయకులు సింగిల్ విండో మాజీ ఛైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, పలువురు నాయకులు నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు గందే హేమసుందరం, సీఎస్‌పురం ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, టీడీపీ నాయకులు వరికూటి హనుమంతు, పోకల మాల్యాద్రి, రేనాటి వెంకటేశ్వర్లు, గుడిపాటి రామారావు, ఎస్పీ నాయుడు పలువురు ఉన్నారు.

## 28న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

**- ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు**



**లింగసముద్రం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
మండలంలోని ఎన్టీఆర్ పెన్షన్ లబ్దిదారులందరికి ఈనెల ఫిబ్రవరి 28న పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు స్థానిక ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్దిదారులకు ప్రభుత్వం ఊరట కల్పించే వార్త చెప్పిందని, మార్చి నెలకు సంబంధించి పెన్షన్లు ఒక రోజు ముందుగానే ఫిబ్రవరి 28వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. మార్చి 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కావున స్వర్ణ గ్రామం సిబ్బంది ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తారని, కావున లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

### భూ సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సిబ్బంది పని చేయాలి

**- మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు**



**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
భూ సంబంధ సమస్యలను నిశితంగా పరిశీలించి నిర్ణీత కాల పరిమితిలోగా ప్రజలకు పరిష్కార మార్గాలను చూపాలని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు జాయింట్ కలెక్టర్ మండల తహసీల్దార్ మంజునాథరెడ్డితో కలిసి భూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ భూ రికార్డుల్లో మ్యుటేషన్ దిద్దుబాటు కోసం పలు దరఖాస్తులను సత్వరం పరిష్కార మార్గం చూపాలని సూచించారు. మండలంలో రెవెన్యూకు సంబంధించిన పలు సమస్యలపై తహసీల్దార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్యలపైన వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో గందరగోళంగా మారిన రాళ్ళవాగు పరిసరాల స్థలాల విషయంలో కొందరు లేవదీసిన పలు సమస్యల విషయంలో స్పందిస్తూ రాళ్ళవాగుకు హద్దులను నిర్ణయించాలని, రాళ్ళవాగు ఎక్కడ ఆక్రమణకు గురి అయింది,రాళ్ళవాగును ఆక్రమించుకొని ఎవరు రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించారు తేల్చాలని ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

### జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

**- సీఎంకు డాక్టర్ ఏలూరి వినతి**



**మార్కాపురం, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త**
నూతనంగా ఏర్పాటైన మార్కాపురం జిల్లాలో ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు.ఈ లేఖను సీఎంఓ అధికారులకు అందజేశారు.లేఖలో ఆయన మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతమని, ఇక్కడ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే రైతులకు ఆధునిక సాగు పద్ధతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ స్థాపనకు అవసరమైన ప్రభుత్వ భూములు ఈ ప్రాంతంలో సమృద్ధిగా ఉన్నాయని, వాటిని వినియోగిస్తే స్థానిక యువతకు ఉన్నత విద్య, పరిశోధన, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మార్కాపురంను జిల్లాగా ప్రకటించినందుకు, అలాగే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా సాగు–తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మార్కాపురంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన వినమ్రంగా విజ్ఞప్తి చేశారు.

## అబ్బుర పరిచిన గొబ్బురు సర్పంచ్

**- ఏపీఆర్‌సెట్‌లో రాష్ట్ర 2వ ర్యాంక్ సాధించిన గోబ్బూరు సర్పంచ్ ఆదినారాయణ**



**పెద్దారవీడు, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం సమీపంలోని గోబ్బూరు గ్రామానికి చెందిన అంగిరేకుల ఆదినారాయణ యాదవ్ రాష్ట్ర స్థాయి పరిశోధన ప్రవేశ పరీక్ష ఏపీఆర్ సెట్ 2024–25లో రెండవ ర్యాంక్ సాధించి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. మహాత్మా జ్యోతిరావ్ ఫూలే స్టడీస్ విభాగంలో 109.6 మార్కులు సాధించి తన మేధస్సును రాష్ట్రవ్యాప్తంగా చాటిచెప్పారు. ప్రస్తుతం గోబ్బూరు గ్రామ సర్పంచ్‌గా ప్రజాసేవలో నిమగ్నమై ఉన్న ఆయన, అదే సమయంలో వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ జిల్లా అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రజాసేవతో పాటు ఉన్నత విద్యలో ఇంతటి విజయం సాధించడం విశేషమని జిల్లా వర్గాలు ప్రశంసిస్తున్నాయి. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన ఆదినారాయణ యాదవ్‌కు తండ్రి ఏ గురవయ్య ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే ఈ విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించడం పట్ల జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, విద్యావేత్తలు, గ్రామ పెద్దలు ఆయనను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షి ంచారు.

### మార్కాపురంలో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు




**మార్కాపురం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
జనసేన పార్టీ ఆధ్వర్యంలో మార్కాపురం నియోజకవర్గ కార్యాలయంలో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉద్యమి సభ్యత్వం కీలకమని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శిరిగిరి శ్రీనివాసరావు, తర్లుపాడు మండల అధ్యక్షులు చేతుల శ్రీనివాసులు, పిన్నెబోయిన శ్రీనివాసులు, కంబం వెంకట రమణ, తిరుమలశెట్టి మధు, కూరంగి రవి, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు ఆవుల వెంకట్, వీరిశెట్టి శ్రీనివాసులు, చాబోలు ఫణీంద్ర, ఇ పిచ్చయ్య, రొడ్డ శ్రీను, వెలుగొండయ్య పాల్గొన్నారు.

### నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఉగ్ర ఆశీస్సులు



**కనిగిరి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణానికి చెందిన ప్రగతి విద్యాలయం అధినేత కొప్పోలు ప్రభాకర్ కుమారుడు సందీప్–సుష్మ నూతన దంపతులను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువాం వారి నివాసంలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ, దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు, బంధువులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రగతి విద్యాలయం ద్వారా విద్యా సేవలు అందిస్తున్న కొప్పోలు ప్రభాకర్ కుటుంబానికి ఎమ్మెల్యే ఉగ్ర అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులు పాల్గొన్నారు.

## 28న రంగస్వామి ఆలయంలో వేలం పాటలు



**రాచర్ల, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**
మండలంలోని జెపి చెరువు గ్రామ సమీపంలో గల శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో ఈనెల 28వ తేదీ శనివారం వ్యాపార విక్రయాలకు సంబంధించి వాయిదా పడ్డ ఐటమ్స్‌కు వేలంపాటలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య ఆలయ చైర్మన్ సిద్ధం నరసింహులు తెలిపారు. ఈ నెల 7వ తేదీన వాయిదా పడ్డ ఐటమ్‌లకు వేలం పాటలు జరుగుతాయని ఆసక్తి గలవారు పాల్గొనాలని వారు కోరారు. కాఫీ, టిఫిన్‌లకు రూ.25వేలు ఐస్ క్రీమ్‌కు రూ.10వేలు ధరావత్ చెల్లించి పాటలో పాల్గొనాలని, ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలంపాటలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

### చిన్న ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు



**దర్శి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
మండలంలోని చిన్న ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయులు ఆర్.నారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల విద్యాశాఖాధికారి బి.రమాదేవి, యూటీఎఫ్ జిల్లా పూర్వం ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, గౌరవ అతిధులు యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎం.చిన్న స్వామి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు టి.రాజశేఖర్, ఎం.శ్రీను, నల్లూరి వెంకటేశ్వర్లు, జేవీకే జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం జడ్పీహెచ్‌ఎస్ టీఎస్‌పురం హెచ్‌ఎం భారతి పాల్గొన్నారు. ఈ పాఠశాలల చైర్మన్ నారాయణ వైస్ చైర్మన్ శ్రీను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ పాఠశాలకు రూ.12వేలతో ఒక టేబుల్, బీరువా పీవీ నారాయణ రెండు ఎస్ చైర్స్ పి.శ్రీనివాసులు బహుమతిగా ఇచ్చియున్నారు. ఎంఈఓ బి.రమాదేవి మాట్లాడుతూ చిన్న ఉయ్యాలవాడ పాఠశాలలో అభివృద్ధిలో గ్రామస్తులు భాగ స్వాములు అవ్వడం గొప్ప పరిణామం అని ఉపాధ్యాయులు గ్రామ చైతన్యంలో భాగస్వాములు అవ్వడం మంచి శుభ పరిణామం అని ఇలానే ప్రతి ఉపాధ్యాయుడుపాఠశాల అభివృద్ధికి పాటు పడాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు పాటలతో ఉల్లాస భరితంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మహిళా కన్వీనర్ వి.ధనలక్ష్మి, కో కన్వీనర్ సత్యవాణి, జిల్లాకార్యవర్గ సభ్యులు పి.కాశీం, మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.రామారావు, గౌరవ అధ్యక్షులు వి.రామిరెడ్డి, కార్యదర్శులు కె.సతీష్‌బాబు, పి.ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అంగన్వాడీలకు న్యాయం చేయాలి

**- వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత డిమాండ్లతో మార్కాపురంలో రిలే నిరాహార దీక్షలు**

**- హామీలు అమలు కాకపోతే మార్చి 2న విజయవాడలో మహాధర్నా**

**- సీఐటీయూ హెచ్చరిక**



**మార్కాపురం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
అంగన్వాడీ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డీకేఎం రఫీ మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీల వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తల్లికి వందనం సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు కూడా వర్తింపజేయాలని కోరారు.

**హామీలు ఇచ్చి మరిచిన ప్రభుత్వం :**
గత 42రోజుల సమ్మె సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ హామీలను అమలు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. యాప్స్ పేరుతో పని భారం పెంచుతున్న ప్రభుత్వం వేతనాల పెంపుపై మాత్రం నిరక్ష్యం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధానమైన డిమాండ్స్ ఈ విదంగా ఉన్నాయి. వెంటనే వేతనాలు పెంచాలని, వేసవి సెలవులు అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, అర్హత కలిగిన మెయిన్ వర్కర్స్‌కు సూపర్వైజర్ పదోన్నతులు గ్రాట్యుటీ అమలుకు గైడ్‌లైన్స్ విడుదల చేయాలని,అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే, మార్చి 2న రాష్ట్ర రాజధాని విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ దీక్షలకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ బాలనాగయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కే సుబ్బరాయుడు, గొట్టం హరి, చెన్నయ్య తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ మాలకొండయ్య, మార్కాపురం మండల నాయకులు జె నాగరాజు, అంగన్వాడీ నాయకులు ఎస్ లక్ష్మి, ప్రభావతి, భారతి, వాసవి, ముంతాజ్, వెంకటరత్నం, మేరీ, కాశిశ్వరి, వెంకటలక్ష్మి, నేరెళ్ల మాధవి, తాతపూడి జయ ప్రమీల, గుజ్జుల నాగేంద్రమ్మ, మహాలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లాకు అభివృద్ధి వరాలు

**- సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు : దార్ల రత్నకుమార్**

**మార్కాపురం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లా చేసి మొట్టమొదటిసారిగా జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన జిల్లా అభివృద్ధికి వరాలు కురిపించడం చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిదర్శనమని గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది దార్ల రత్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రత్న కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లా అభివృద్ధి కోసం ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం చంద్రబాబు నాయుడుకు ఈ ప్రాంతంపై ఉన్న మక్కువ అని పేర్కొన్నారు. పశ్చిమ ప్రాంత వర ప్రధాహిని అయిన వెలుగొండ ప్రాజెక్టుకు 456 కోట్లరూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టడం శుభసూచకమని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు ను 14నెలల్లో పూర్తి చేసి సాగు, త్రాగు నీటిని అందిస్తామని చెప్పడం మంచి పరిణామమని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలపడం చంద్రబాబు నాయుడు విజనరీకి నిదర్శనం అని రత్నకుమార్ తెలిపారు.

## ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట



**రాచర్ల, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**
మండలంలోని జేపీ చెరువు గ్రామంలో శ్రీశ్రీశ్రీ పట్టాభి సీతారామ స్వామి ఆలయంలో విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఫాల్గుణ మాస శుద్ధ నవమి గురువారం ఉదయం 10 గంటల రెండు నిమిషాలకు యంత్ర ప్రతిష్ట శిఖర కలశ ప్రతిష్ట విమాన గోపుర ప్రతిష్ట ధ్వజ ప్రతిష్ట మహా పూర్ణాహుతి శాంతి కళ్యాణం మహా మంగళహారతి వేద ఆశీర్వచనములు తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు పూజారి అన్నవరం సత్యనారాయణ చార్యులు వారి బృందం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటల నుండి విద్యుత్ దీపాలంకరణలతో కోలాట ప్రదర్శనలతో శ్రీ సీతారామ స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం పెద్దలు గ్రామ ప్రజలు అట్టహాసంగా నిర్వహించారు. ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా భక్తులకు దాతలు కన్నసాని గోపాలరావు సూర్యనారాయణ ఓబుళపతిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## సత్తాచాటిన కొమరోలు మండల ఎడ్లజత



**రాచర్ల, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**
మండలంలోని జిపి చెరువు గ్రామంలో శ్రీ పట్టాభి సీతారామస్వామి విగ్రహ, ధ్వజ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ఎడ్లబండలగుడు పోటీల్లో కొమరోలు మండలం పామూరు పల్లి గ్రామానికి చెందిన కామూరి రమణారెడ్డి గోపు రమణారెడ్డి ఎడ్లజత సత్తాచాటి నిర్ణీత సమయానికి 3274.6 అడుగులు దూరం లాగి మొదటి బహుమతి 15వేల రూపాయలు కైవసం చేసుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 20జతల ఎడ్లు పాల్గొనగా పోటీలను రంగస్వామి దేవస్థానం చైర్మన్ సిద్ధం పెద్ద నరసింహులు ప్రారంభించారు. గిద్దలూరు మండలం మోడంపల్లి గ్రామానికి చెందిన దేమ శ్రీరాములు ఎడ్లు 3000 అడుగులు లాగి రెండవ బహుమతి రూ.10 వేలు దక్కించుకోగా, అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన షేక్ పెద్ద మీరావలి ఎడ్లు 2854.8 అడుగులు దూరం లాగి మూడవ బహుమతి రూ.8 వేలు సొంతం చేసుకున్నాయి. మిగిలిన 4, 5, 6, 7, 8 బహుమతులను వివిధ గ్రామాలకు చెందిన మండలాలకు చెందిన ఎడ్లు గెలుపొందాయి.

### ఐవిఆర్‌ఎస్‌కాల్స్‌పై ప్రజలకు అవగాహన

**రాచర్ల, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**
మండలంలోని చోళ్ళవీడు, ఆకవీడు గ్రామాల్లో ఐవిఆర్‌ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రభుత్వం నుండి ప్రజలకుకాల్స్ వస్తాయని వాటికి సంబంధించి సమాధానాలు అవునంటే అవును కాదంటే కాదు అని చెప్పాలన్నారు. లేనిది ఉన్నట్లు ఉన్నది లేనట్లు చెప్పొద్దని తెలిపారు. ముఖ్యంగా ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలని ఆయన ప్రజలకు సూచించారు. పన్నుల చెల్లింపు విషయంలో నిరక్ష్యం వహించవద్దని ప్రజలను కోరారు. సిబ్బందిపన్నులవసూలులో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐ.వెంకటేష్ జిఎస్ డబ్ల్యూ ఎస్ డిప్యూటీ ఎంపీడీవో ఓవికెఎస్ కుమార్ కార్యదర్శులు వి అనిల్ కుమార్, ఏవి సురేష్, కె శివరామకృష్ణ, బిబాలస్వామి,జి.ప్రతాపరెడ్డి,సర్పంచ్ టి దేవదానం, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఏపీటీఎఫ్ ధర్నాను జయప్రదం చేయండి



**దర్శి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
దర్శి ఏపీటీఎఫ్ కార్యాలయం నందు ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ అధ్యక్షులు తూము శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈనెల 27న 10గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర పీఆర్సీ, ఐఆర్, సీపీఎస్ రద్దు వంటి అనేక సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమంలో దర్శి మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు. ప్రతి ఆరు నెలలకు ఇవ్వాల్సిన డీఏలు సరిగా ఇవ్వడం లేదని, పీఎఫ్ మొత్తం, సరెండర్ లీవులు సకాలంలో రావడం లేదని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, వెంటనే పీఆర్సీ కమీషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎస్ హెచ్ఎం పోస్టులు ఎస్‌జీటీ ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని, అనేక సమస్యలు పరిష్కరించాలని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. ఇంకా ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నక్కా కోటేశ్వరరావు, ఏపీటీఎఫ్ సబ్‌కమిటీ సభ్యులు అమరా శ్రీనివాసులు, జి.వేణు, సందు వెంకటేశ్వర్లు, ఎంవీ నరసింహం, నాదెళ్ల శ్రీను, కంటా శ్రీనివాసులు, ఎం.సాంబయ్య, పానెం గోవింద్, ముత్యాల శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శిద్దా లక్ష్మీ పద్మావతి





**దర్శి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
దర్శి పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకుడు దేవతి మహానంది, మల్లీశ్వరి దంపతుల కుమారుడు భరత్ తేజ, వెంకట లక్ష్మీ సాత్విక నూతన వధూవరుల గృహంలో గురువారం సత్యనారాయణ స్వామి వ్రతం పూజ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మహానంది, మల్లీశ్వరి దంపతులు లక్ష్మీ పద్మావతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో పాల్గొన్న ఏవో



**ముండ్లమూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలో ఈదర, కొమ్మవరం గ్రామాలలో మండల వ్యవసాయాధికారి తిరుమలరావు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం ఏవో మాట్లాడుతూ మండలంలోని రైతులందరూరైతు నమోదు సంఖ్య కలిగి ఉండాలని, రైతు రిజిస్ట్రేషన్ ఐడీ ఉంటేనే పీఎం కిసాన్ పథకంకి అర్హులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయం విస్తరణ అధికారి శ్రీకీర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు తిప్ప స్వామి పాల్గొన్నారు.

## సబ్ జైలు స్థలాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి



**దర్శి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**
దర్శిలోని అద్దంకి రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ గుడి దగ్గర సర్వే నెంబర్ 331.332.332/2జీ. 2సీ, 2ఈ లలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి సందర్శించారు. సబ్ జైలుకి స్థలాన్ని పరిశీలనలో భాగంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అండగా ఎమ్మెల్యే ఉగ్ర.. ఊరటనిచ్చిన సీఎం సహాయనిధి





**కనిగిరి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పైడిమర్రి మాధవి, గంధం వెంకటరమణ, వల్లపు చిన్న మాలకొండయ్య, రాగిపిండి పాపులమ్మ, మేడ శ్రీనివాసులు, నారాయణ, మాలకొండయ్య, చింతలపూడి శ్రీనివాసులు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వాళ్ల ఇంటికి వెళ్లి చెక్కును స్వయంగా లబ్దిదారులకు అందించారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్దిదారుల కుటుంబాలకు ఈ సాయం ఊరటనిచ్చింది. ప్రజల సమస్యలపై స్పందిస్తూ అర్హులైన వారికి ప్రభుత్వ సహాయం చేరేలా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషి చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ నాయకులు తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, వెన్న శ్రీనివాసరెడ్డి, నాగార్జునయాదవ్, కొల్లూరి శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ షేక్ రెహమాన్, మాజీ కౌన్సిలర్ బుల్లా బాలబాబు, అంజి నాయుడు, కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, కొలిపర్తి మారుతి, కాకుమాని బాబు, పైడిమర్రి సత్యనారాయణ, కోట సురేష్, ఏఎంసీ డైరక్టర్ శ్రీనివాసులు, రవి వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్దిదారులకు అందేలా కట్టుబడి పని చేస్తామని వారు తెలిపారు.

## ఆపన్నులకు అండగా ఉగ్ర.. సీఎం సహాయనిధితో చిరునవ్వులు



**కనిగిరి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ కనిగిరి శాసన సభ్యులు, ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కనిగిరి మండల పరిధిలోని దిరిశవంచ గ్రామానికి చెందిన బత్తుల బ్రహ్మయ్య, లింగారెడ్డి గ్రామానికి చెందిన నాగేంద్ర, శీలం శ్రీను, వంగపాడు గ్రామానికి చెందిన గడ్డం అశ్విని, పునుగోడు గ్రామానికి చెందిన గాజులపల్లి పెద్ద చిన్నయ్యలకు మంజూరైన చెక్కులను పార్టీ నాయకులు వారి ఇళ్లకు వెళ్లి స్వయంగా అందించారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటనిచ్చింది లబ్దిదారులు తెలిపారు. క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక తోడ్పాటు తమకు మానసిక ధైర్యాన్ని ఇచ్చిందని కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సింగిల్ విండో చైర్మన్ కమతం వెంకటేశ్వర్లు, గంగవరపు నాగిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కాకర్ల సూర్యనారాయణ, పేరయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. సీఎం సహాయనిధి ద్వారా అందిన ఈ ఆర్థిక సాయం ఆపన్నుల ముఖాల్లో చిరునవ్వులు పూయించిందని వారు తెలిపారు.

### గంటవానిపల్లి సర్పంచ్ ఎక్కంటి రమాదేవి టీడీపీ కండువా మెడలో వేసుకుని

## ముఖ్యమంత్రిని కలవడం దోర్నాలలో ఒకటే చర్చ



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
పెద్దదోర్నాలలో రాజకీయ చర్చకు దారి తీసిన ఘటన చోటు చేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన గంటవానిపల్లి సర్పంచ్ ఎక్కంటి రమాదేవి టీడీపీ కండువా మెడలో వేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలకడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ ఆధునిక పనులకు శంకుస్థాపనకు విచ్చేసిన ముఖ్యమంత్రి పర్యటనలో ఈ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. సాధారణంగా వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ గంటవానిపల్లి పరిధిలో ఉంది. ఈ క్రమంలో గ్రామ సర్పంచ్‌గా ప్రోటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేమి లేదు. ప్రోటోకాల్ ప్రకారం గ్రామ సర్పంచ్‌గా ముఖ్యమంత్రిని కలవడం గౌరనీయం. ఆమె ముఖ్యమంత్రిని కలిసినందుకు చర్చ జరగడం లేదు. కానీ వైసీపీకి చెందిన రాజకీయ ప్రతినిధిగా ఉండి ఇలా వ్యవహరించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. టీడీపీ వర్గాలు మాత్రం దీనిని తమ పార్టీపై పెరుగుతున్న ఆకర్షణగా పేర్కొంటున్నాయి.

# లక్ష్మీనరసింహస్వామికి హుండీ లెక్కింపు

**- ఆదాయం 4,18,690**



**అద్దంకి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా అద్దంకి మండలం సింగరకొండ గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో గురువారం ఉదయం 10గంటలకి హుండీ లెక్కించారు. 156రోజులకి గాను 4,18,690 రూపాయలు ఆదాయం వచ్చినది అని ఎం వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుంజి శ్రీనివాసరావు చైర్మన్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కార్యనిర్వహణా ధికారి మద్దినేని శ్రీనివాస్ రావు పాల్గొన్నారు

# కందులకు గిట్టుబాటు ధర

**- రైతులు సద్వినియోగం చేసుకోవాలి - ఎఒ**



**అద్దంకి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
కందులు గిట్టుబాటు ధర వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. తిమ్మాయపాలెం గ్రామంలో నాఫెడ్ వారి ఆధ్వర్యంలో గుండ్లకమ్మ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ వారి ద్వారా కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కందులు క్వింటాల్ ఒక్కటి కి 8 వేల రూపాయలు మద్దతు ధర లభిస్తుంది అని తెలిపారు. తేమశాతం 12 లోపు ఉండాలని సూచించారు. కార్యక్రమం లో ఆర్గనైజేషన్ చైర్మన్ పోలగంగుల శ్రీనివాసరావు, కాసయ్య, గుర్రం పేరయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరి రక్షణకు వినూత్న ఆలోచన

**- వివాహ విందులో ప్లేట్లులో భోజనాలు**





**అద్దంకి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
పట్టణంలోని కూకట్ల కన్వెన్షన్‌లో ఓ వివాహ విందులో పాల్గొన్న రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ప్రెసిడెంట్ బాచిన పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిరోధించే ప్రక్రియలో భాగంగా, తను ఇంటి నుండి పింగాణి ప్లేట్ తెచ్చుకొని దానిలో భోజనం చేసి, అనంతరం శుభ్రం చేసి ప్లేట్ తీసికొని వెళ్లారు. ఈ విధానం అందరూ అనుసరిస్తే ప్లాస్టిక్ నిరోధించడమే కాకుండా వివాహ విందులో ఖర్చును కూడా తగ్గించవచ్చును అని పూర్ణచంద్రరావు అభిప్రాయపడుతున్నాడు. ఈ కార్యక్రమంలో విందులో పాల్గొన్న పర్యావరణ ప్రేమికులు మన్నం త్రిమూర్తులు, రోటరీ కార్యదర్శి అళహరి హరిప్రసాదు, రోటరీ మాజీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య తదితరులు పూర్ణచంద్రరావుని అభినందించారు.

# రీడింగ్ రూమ్‌నకు శంకుస్థాపన

**- మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన పట్టణ ప్రజలు**



**అద్దంకి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలో గల భవాని సెంటర్లో రీడింగ్ రూమ్ ప్లేస్ నందు ఈరోజు ఉదయం 10.10 నిమిషములకు రీడింగ్ రూమ్ కం కళాక్షేత్రము భవన నిర్మాణమునకుశంకుస్థాపన జరిగినది. ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర పరిరక్షణలో జరిగినది. కార్యక్రమం ఉద్దేశించి మున్సిపల్ కమిషనర్ డి రవీంద్ర మాట్లాడుతూ అందరి ఆకాంక్ష మేరకు, అందరు ఉపయోగము కొరకు విద్యుత్ శాఖ మాత్యులు శ్రీ గొట్టిపాటి రవి కుమార్ కృషి, ఉత్తర్వుల మేరకు నేడు అద్దంకిలో రీడింగ్ రూమ్ నిర్మాణం నకై ఈరోజు శంకుస్థాపన జరిగినది. రాష్ట్రవిద్యుత్‌శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్ గారి చొరవతో ఆదాని కంపెనీ ద్వారా సిఎస్ఆర్ గ్రాంట్ కింద 3.30 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, సంవత్సరంలోపు భవన నిర్మాణం పూర్తి అవుతుందని కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ రీడింగ్ రూమ్‌నకు ఎంతో చరిత్ర ఉన్నదని, సుమారు 70 సంవత్సరాల నుండి ఎంతోమంది కృషి మేరకు ఈ స్థలము నేటి వరకు రక్షణ భాగంలో ఉండి ఉన్నదని, నేడు అందుకు తగిన కృషి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంకల్పబలం మేరకు నేడు ఈ స్థలములో గొప్ప రీడింగ్ రూమ్ కం కళాక్షేత్రము నిర్మాణము జరుగుటకు ఈరోజు శంకుస్థాపన జరిగినదని త్రిమూర్తులు అంటూ, రీడింగ్ రూమ్ నాటి బాధ్యులైన లక్కరాజుదాసు మాస్టారు, సిద్దిన మల్లికార్జునరావు, అద్దంకి హనుమంతరావు, వెలిదండ్ల వెంకటరత్నం, గోరంట్లచిన్న వీర రాగవయ్య, కాకాని పాపయ్య మొదలగు వారందరికీ జోహర్లు అని, కూటమి ప్రభుత్వ అభివృద్ధికి ఇది నిదర్శనమని త్రిమూర్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ ఎల్ ఎస్తేరమ్మ, డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, చిన్ని శ్రీనివాసరావు, సంధి రెడ్డి శ్రీనివాసరావు, నాగినేని రామకృష్ణ, చుండూరి మురళి సుధాకర్, అత్తులూరి రమేష్ కంపారజిని, రంగిశెట్టి సుభాషిని, షేక్ జహీరా, మన్నెంఏడుకొండలు దామా హనుమంతరావు, ఎర్రాకుల రామాంజనేయులు, సంధిరెడ్డి రమేష్, రంగిశెట్టి లహరి, షేక్ మాబు, మాగులూరు గోపి, షేక్‌ఖాసిం, గార్లపాటి శ్రీనివాసరావు, చెన్నుపాటి వీరాంజనేయులు, నర్రా శ్రీనివాసరావు, దోప్పలపూడి ప్రసాద్, బిళ్ళపాటి రామాంజనేయులు, మొహిద్దిన్, గుంటూరు మాధవరావు, మల్లాది శ్రీనివాసరావు, కొండలు , శ్రీను, హరి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో హైస్కూల్‌కి 10 టేబుల్స్ బహుకరణ





**అద్దంకి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ సింగర్ కొండ అద్దంకి ఆధ్వర్యంలో కాకాని పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు 25 వేల రూపాయల విలువైన 10 టేబుల్స్ వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థికసహకారం అందించిన దాతలు చిన్ని మురళీకృష్ణ, సంకా సుబ్రహ్మణ్యం (బాబు), చిన్ని సురేష్ బాబు, చంద్ర వెంకట రమణమ్మ, షేక్ ఖాదర్ మస్తాన్, ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో, బాగా చదివి ఉన్నతఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరుతేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణు, రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణ చంద్రరావు, కార్యదర్శి అళహరి హరి ప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ. నరసింహారావు, చప్పిడి వీరయ్య, పువ్వాడ రామకోటేశ్వరరావు, అన్నంగిసుబ్బారావు, ఊటుకూరు రామ కోటేశ్వరరావు, గూడా లక్ష్మీరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయసిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం పాఠశాల ఎచ్ఎం టేబుల్స్ సమ కూర్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపి శాలువాల తో సత్కరించారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



**దర్శి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**
దర్శిలోని పొదిలి రోడ్డులో గల శ్రీషిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమం జరిగింది. అద్దంకి రోడ్డుకు చెందిన స్నేహ ఇండియన్ గ్యాస్ మేనేజర్ జ్యోతి అంజయ్య అమ్మగారి జ్యోతి అక్కమ్మ వర్ధంతి సందర్భంగా దర్శి షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాలకు ఒకేషనల్ రూమ్ ప్రారంభం

**అద్దంకి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 30 వేల విలువ చేసే నూతన ఒకేషనల్ రూమును దాతలు అచ్చాల వెంకట బ్రహ్మతేజరెడ్డి, కావేరి, తల్లిదండ్రులు అచ్చాల బ్రహ్మారెడ్డి, సుంకర శ్రీదేవి ఎస్ఎ, పిఎస్‌ప్రోత్సా హంతో ఏర్పాటు చేశారు. పాఠశాలహెచ్ఎం కటకం శ్రీనివాసరావు నూతన రూమును ప్రారంభించారు. ఉపాధ్యాయులు నాగప్రసూన, ఉమాజ్యోతి, గొట్టిపాటి శ్రీదేవి, లక్ష్మి, దివ్యతేజ, సునీత, శ్రీలక్ష్మి, శారద, సుబ్బరావమ్మ, ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రసన్నాంజనేయస్వామికి వెండి కిరీటం బహుకరణ





**అద్దంకి ,ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా ఈటి గ్రామం కుంచెపు శ్రీనివాసరావు అనంత కుమారి, చిరంజీవి వెంకటరమణ కుమారి, మారుతి ధర్మపత్ని లక్ష్మీ తిరుపతమ్మలు వెండి కిరీటం బహుకరించారు. విలువ 5,57600.తూకం ఒక కేజీ 680 గ్రాములు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, పాలక మండల అధ్యక్షులు చుండూరు మురళీ సుధాకర్‌రావు, సభ్యులు ఆకుల కోటేశ్వరమ్మ కోటేశ్వరరావు, ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం దాతలకు అర్చకులు పూజా కార్యక్రమం, శేష వస్త్రంతో సన్మానించారు.

### సింగరకొండ తిరుణాల్లో చిరు వ్యాపారుల నుండి బలవంతపు వసూలు ఆపాలి

**- సిపిఎం డిమాండ్**



**అద్దంకి ,ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం సింగరకొండ 71వ వార్షిక తిరునాళ్ళు మహోత్సవం సందర్భంగా రోడ్డు పక్కన బొమ్మల అమ్ముకునే చిరు వ్యాపారుల ద్వారా పాట పేరుతో బలవంతపు డబ్బులు వసూలు చేయటం జరుగుతుందని ఈ విధానాన్ని వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం పార్టీ అద్దంకి కమిటీ తరఫున డిమాండ్ చేస్తూ ఈ విషయమై గురువారం అద్దంకి ఆర్డిఓ ఆఫీస్ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డి ఏ ఓ పి సురేష్ బాబు కి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ అద్దంకి కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీ ప్రసన్నాంజనేయ సింగరకొండ తిరుణాళ్ళ ఈ చుట్టుపక్కల జిల్లాల్లో రెండవ అతిపెద్ద తిరునాళ్ళు జరుగుతుందని లక్ష లాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడం కోసం స్త్రీ మరియు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలియజేశారు. ఇదే సందర్భంలో తిరుణాలకి చిరు వ్యాపారులు బొమ్మలను అమ్ముకునే అందుకు అంగడి ద్వారా రోడ్డు పక్కన తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకొని తిరునాళ్లకు వచ్చే భక్తులకు కావాల్సిన బొమ్మలు ఇతర ఇంటి అవసరాల కోసం కొన్ని వస్తువులు కొనుగోలు చేయడం సిద్ధం చేయటం జరుగుతుందని ఇది ఒక రకంగా భారీ స్థాయి పెద్ద వ్యాపార కేంద్రంగా ఆరోజు వస్తువులు కొనుగోలు చేస్తూ పిల్లలకు అవసరమైన రంగులరావటాలు మరియు అన్ని రకాల ఉత్సాహపూరితమైన కార్యక్రమంగా దీన్ని భావించి వస్తున్నారని ఈ సమయంలో కొంతమంది వ్యక్తులు ఆర్థికంగా ఉపయోగించుకునే దానికోసం ప్రతి సంవత్సరం పాట ద్వారా ఈ వసూలు చేసే విధానాన్ని దక్కించుకోవడం జరుగుతుందని ఈ సంవత్సరం 16 లక్షల పైచిలుకు ఆటపాడుకోవడం జరిగిందని అదనంగా లక్షలాది రూపాయలు వసూలు చేసుకోవటం జరుగుతుందని ఇది అంతిమగా భక్తులు మరియు ప్రజల పైన లక్షలాది రూపాయలు ఆర్థిక భారం పడుతుందని కావున పాటను రద్దుచేసి చిరు వ్యాపారుల నుండి వసూలు చేసే విధానాన్ని నిలుపుదల చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు ఎస్ కే కరీమ్, పి నాగేశ్వరరావు. పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో గార్లపాటి ప్రత్యేక పూజలు



**అద్దంకి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
ముండ్లమండలం, మారెళ్ళ గ్రామంలో బుధవారం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట జరిగింది. ఈ సందర్భంగా విమల్‌రాజ్ కుమార్ అరోరా(బొంబాయి) ఆధ్వర్యంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అద్దంకి పట్టణానికి చెందిన భాస్కరా సప్లయర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు, శివకుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

### ముస్లిం మహిళల హర్షధ్వానాలతో మసీదు ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన

**- పాల్గొన్న డాక్టర్ లక్ష్మీ**





**ముండ్లమూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
ఆనాడు తండ్రి ఎమ్మెల్యేగా ఉండగా మసీదు నిర్మాణానికి సహాయం చేస్తే నేడు తనయురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించారని ముస్లిం పెద్దలు కొనియాడారు. ముండ్లమూరు మండలం అగ్రహారం గ్రామంలో గురువారం మసీదు ప్రహరి గోడ నిర్మాణంలో దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ముస్లిం మహిళలతో కలిసి ప్రహరీ గోడ నిర్మాణ పనులలో నేను సైతం అంటూ బిందె పట్టుకొని పునాదుల్లో నీళ్ల పోసి తండ్రికి తగ్గ తనయురాలుగా నిరూపించుకున్నారు. ఆనాడు మార్టూరు శాసనసభ్యులుగా ఉన్న గొట్టిపాటి నరసయ్య అగ్రహారం మసీదు నిర్మాణానికి సిమెంటు ఇచ్చి నిధులు ఇప్పించి కృషి చేశారు. ఇప్పుడు ఆయన తనయురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు మాతో పాటు చేయి చేయి కలిపి పునాదుల్లో నీరు పోస్తూ అభివృద్ధిలో నేను సైతం అంటూ ముందు ఉండడాన్ని అందరూ హర్షిస్తున్నారు. అదే గ్రామంలో పంచాయతీ రూ.5లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డుకి భూమి పూజ చేశారు. తదుపరి గ్రామ ముస్లిం సోదరులు, పెద్దలతో కలిసి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసిన టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట రామారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షులు రావులపల్లి విరాంజి, క్లస్టర్ రాఘవరెడ్డి, రామారావు, నాగరాజు, పౌలు, మేదరమెట్ల వెంకటరావు, తెల్లయ్య, కూటమి శ్రేణులు తదితరులు ఉన్నారు.

## సిఎం అనుమతితో ఇంధన శాఖలో త్వరలో సిబ్బంది నియామకం

**- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి వెల్లడి**



**అద్దంకి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**
విద్యుత్ శాఖలో సిబ్బంది కొరతను భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుమతితో త్వరలోనే నియామక ప్రక్రియ చేపడతామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గురువారం నాడు మండలిలో సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి సమాధానం చెప్పారు. క్షేత్ర స్థాయిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సిబ్బంది అవసరం ఉందని మంత్రి తెలిపారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా, రీస్టోరేషన్ పనుల కోసం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వంటి వివిధ పద్ధతుల ద్వారా నియామకమైన 18,000 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. రెగ్యులర్ మెయింటినెన్స్, విద్యుత్ అంతరాయాలు తగ్గించడంతో పాటు ఓల్టేజ్ స్టెబిలిటీని పెంచడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. వినియోగదారులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించే లక్ష్యంతో విద్యుత్ శాఖ ముందుకు వెళ్తుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న 5,580 మంది సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ద్వారా సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లకు శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించేకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లు విద్యుత్ శాఖకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే 77 శాతం పైగా ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అదే విధంగా ఏఈల నియామక ప్రక్రియ కూడా త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. లైన్ మెన్‌ల నియామకం పైనా ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని మంత్రి సభ్యులకు వివరించారు. అదే విధంగా క్షేత్ర స్థాయి విద్యుత్ అవసరాలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అందుబాటులో ఉన్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించు కుంటున్నామన్నారు.

**8 వేల కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు**

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయం విద్యుత్ సరఫరా చేయడం కోసం రూ.8 వేల కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు చేపట్టినట్లు మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఫీడర్ లెవల్ బైఫర్కేషన్ ద్వారా అగ్రికల్చర్ ఫీడర్లను వేరు చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా గ్రామాల్లో ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏప్రిల్ నాటికి 100 శాతం పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా విశాఖపట్నం వంటి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నష్టం కలుగకుండా అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి ప్రకటించారు. తుపానులు, వరదలు వచ్చినప్పుడు విద్యుత్‌శాఖ ఉద్యోగులు ప్రాంతాలు, డిస్కంలతో సంబంధం లేకుండా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాలు వరద ప్రభావానికి గురైనప్పుడు ఉద్యోగులందరూ రాత్రి, పగలూ కష్టపడి 24 గంటల్లోనే ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ పనరుద్ధరణ చేపట్టినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు.

